క్లుప్తంగా

అభినందనలు



దుండిగల్: తమ కళాశాల క్రీడల కోసం విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.1.50 కోట్ల స్కాలర్‌షిప్‌లను ఇస్తూ ప్రోత్సహిస్తుందని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఇటీవల గోకరాజు గంగరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పురుషులు, మహిళలు విన్నర్లు, రన్నర్లుగా నిలిచారు. వీరిని మంగళవారం కళాశాల ఆవరణలో మర్రి రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే తమ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ పాల్గొని విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు.

వేతన పెంపు కంటి తుడుపు చర్య

నిజాంపేట్: మున్సిపల్ కార్మికులకు కంటి తుడుపు చర్యగా రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి రూపాయల వేతనాన్ని పెంచిందని సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ బాలపీరు అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మేడే సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు వెయ్యి రూపాయలు పెంచి సీఎం కేసీఆర్ గొప్ప కానుకగా ప్రకటించారని అన్నారు. పీఆర్సీ కమిషన్ రూ.34 వేల వేతనాన్ని నిర్ణయిస్తే రాష్ట్ర ప్రభుత్వం కోతలు పెట్టి రూ.15,600 ఇస్తోందని ఆరోపించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్న రూ.21 వేల జీతాన్ని తెలంగాణలో సైతం వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం



ఎన్సీఎల్‌కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: మున్సిపల్ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పరుస్తున్నామని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. మంగళవారం 12వ వార్డు పరిధి ఎన్సీఎల్ కాలనీలో ఆర్‌కే అపార్ట్‌మెంట్స్ నుంచి శ్రీకృష్ణ బృందావన్ అపార్ట్‌మెంట్స్ వరకు రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై కౌన్సిలర్ శిరీషతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ.. ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్ సన్న రవి యాదవ్, మున్సిపల్ అధికారులు, కాలనీ వాసులు ఉన్నారు.

4 నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని శ్రీనల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలియజేసింది. 4వ తేదీన గణపతిపూజ, స్వామి వారికి అభిషేకం, లక్ష పుష్పార్చన, మంగళ హారతి, 5వ తేదీ ఉదయం 11.07 గంటలకు అభిజిత్ లగ్నమున స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని కోరింది.

పరామర్శ



కుత్బుల్లాపూర్: కొత్తగూడెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సును టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వైఎస్సార్ టీపీ యూత్ కో.ఆర్డినేటర్ దయాకర్‌రెడ్డి గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మేడ్చల్ జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దయాకర్‌రెడ్డిని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

మేడ్చల్ టీచర్‌కు కవి శ్రేష్ఠ బిరుదు

మేడ్చల్: నగర శివార్లలోని పటాన్‌చెరులో నిర్వహించిన సాహితీ సంబరాల్లో పాల్గొన్న మేడ్చల్ టీచర్‌కు కవి శ్రేష్ఠ బిరుదు లభించింది.పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో తెలుగు టీచర్ గా పని చేస్తున్న అత్వెల్లికి చెందిన గండవరం కొండల్‌రావుకు నిర్వాహకులు కవి శ్రేష్ఠ బిరుదు ప్రదానం చేశారు.

పంట నష్టం.. జేపీఎస్ సమ్మెపై చర్చ

- నేడు జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం
- హరితహారం, రోడ్లు, పేరుకుపోయిన సమస్యలు ,పెండింగ్ బిల్లుల ప్రస్తావన
- హాజరుకానున్న మంత్రి, ప్రభుత్వ విప్, కలెక్టర్ తదితరులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అకాల వర్షాలతో దెబ్బ తిన్న పంటలకు నష్ట పరిహారం అందకపోవటం.... ధాన్యం కొనుగోళ్లు చేపట్టక పోవటంతోపాటు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 5 రోజులుగా 30గ్రామాల్లో విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న జూనియర్ ,అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై జెడ్పీ సభలో చర్చించేందుకు బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు సిద్ధమవుతున్నారు. బుధవారం జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరగనుంది. జిల్లా మంత్రి సీహెచ్ మల్లారెడ్డి తోసహా ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ,ఎంపీ రేవంత్‌రెడ్డి, కలెక్టర్ అమయ్‌కుమార్, సీఈఓ దేవసహాయం, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొననున్నారు.

8 గ్రామాల్లో 627 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో ఏప్రిల్ 22 నుంచి 29 వరకు కురిసిన అకాల వర్షాలతో ఘట్కేసర్, మేడ్చల్ మండలాల పరిధిలోని 8 గ్రామాల్లో 412 మంది రైతులకు సంబంధించి 627 ఎకరాల్లోని వరి పంట దెబ్బతినటంతో భారీగా పంట నష్టం వాటిల్లింది. ఆయా గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయటంతోపాటు నష్ట పరిహారం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

సెంటర్లు ప్రారంభమైనా... ముందుకు సాగని కొనుగోళ్లు

యాసంగిలో జిల్లాలో 33 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉండవచ్చునని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, 11 కొనుగోలు కేంద్రాల ద్వారా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఘట్కేసర్ మండలంలో రెండు, మేడ్చల్ మండలంలో ఒక ధాన్యం సేకరణ కేంద్రాన్ని ఐదు రోజుల క్రితమే ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు. వర్షాలకు ధాన్యం తడిసి పోయిందన్న నెపంతో ఎదులాబాద్‌లో ధాన్యం కొనుగోలుకు అధికారులు నిరాకరించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు రోజులుగా కార్యదర్శుల సమ్మె బాట

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 30 గ్రామాలకు చెందిన జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన కొనసాగిస్తున్నారు. జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉండగా, 30 పంచాయతీలకు చెందిన ఉద్యోగులు సమ్మె చేస్తుండటంతో ఆయా గ్రామాల్లో పాలన పడకేసింది. ఈ విషయమై పలువురు సభ్యులు జెడ్పీలో చర్చించేందుకు సిద్ధమవుతున్నారు.

పెండింగ్ సమస్యలపైనా ..

జిల్లాలో పేరుకుపోయిన పెండింగ్ సమస్యలతోపాటు తాగునీరు, బెల్ట్ షాపులు, గంజాయి, పంచాయతీ శాఖ బిల్లులు, అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ ,అసైన్డ్ భూముల అక్రమణలపై జెడ్పీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

పెద్దలను వదిలేసి పేదవారిపై ప్రతాపమా?



కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌ను చూపుతున్న మాజీ వార్డు సభ్యురాలు గడ్డం పద్మావతి

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్న వారిని వదిలిపెట్టి 60 ,70 గజాల్లో నిర్మాణాలు చేపట్టే వారిపై మున్సిపల్ అధికారులు తమ ప్రతాపం చూపడం ఎంతవరకు సమంజసమని మాజీ వార్డు సభ్యురాలు గడ్డం పద్మావతి ప్రశ్నించారు. దూలపల్లి ప్రధాన రోడ్డు ఆనుకొని ఉన్న తన 360 గజాల్లో కేవలం 60 గజాలలో కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌తో నిర్మాణం చేపడుతుండగా మున్సిపల్ అధికారులు అడ్డుకుని పనులు నిలిపివేయడం హేయమైన చర్య అన్నారు. ఇదే రోడ్డు గుండా పదుల సంఖ్యలలో అక్రమ సెల్లార్లు, జీప్లస్ వన్ అనుమతితో ఏకంగా జీ ప్లస్ త్రీ నిర్మాణాలు వెలుస్తుంటే అధికారులకు కనబడట్లేదా అని ప్రశ్నించారు. ఫాక్స్‌సాగర్‌ను అనుకొని ఇంటి అనుమతితో ఎంచక్కా భారీ గోదాములు వెలుస్తున్న విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు అటువైపు చూసిన పాపన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పద్మావతి తెలిపారు.



సరిగమప చాంప్స్ సందడి

సాక్షి, సిటీబ్యూరో: సంగీత శిక్షణార్థులతో కలిసి సరిగమప లిటిల్ ఛాంప్స్ సందడి చేశారు. కొంపల్లిలోని ముజిగల్ సంగీత్ అకాడమీని మంగళవారం సందర్శించిన సరిగమన లిటిల్ ఛాంప్స్ తమ సంగీత ప్రదర్శనలతో వారిని అలరించారు. ఈ సందర్భంగా ట్రినిటీ పరీక్షలు పాస్ అయిన ఔత్సాహిక సంగీత కళాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సరిగమప ఛాంప్స్.. వాగ్దేవి , శశాంక్, శ్రావణితో పాటు ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ యేలూరి తదితరులు పాల్గొన్నారు.

సర్వే నం.233, 51లలో స్థలాల పరిశీలన



అధికారులను కలిసేందుకు వచ్చిన విజయదుర్గ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ మంగళవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్. 233, 51లలోని ప్రభుత్వ స్థలాలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 58, 59ల నేపథ్యంలో ప్రభుత్వ స్థలాలు ఎంత వరకు అక్రమణకు గురైంది, ఎన్ని ఎకరాలు మిగిలాయన్న విషయాలపై బాచుపల్లి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అధికారులను కలిసేందుకు వచ్చిన వారికి చుక్కెదురు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాలను మంగళవారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌లు సందర్శించారు. ఈ నేపథ్యంలో సర్వే నంబర్.51, 52లలో ప్లాట్లు కొనుగోలు చేసిన విజయదుర్గ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు అధికారులను కలిసేందుకు యత్నించగా చుక్కెదురైంది. దీంతో తాము కొనుగోలు చేసిన స్థలం వద్ద 400 మంది ప్లాట్ల యజమానులు చేరుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ప్రెసిడెంట్ సీఎస్‌ఆర్ మూర్తి, వైస్ ప్రెసిడెంట్ హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి సంపూర్ణరెడ్డి తదితరులు ఉన్నారు.

మియాపూర్- నార్సింగి బస్సు నంబర్ 221

- ప్రతి 15 నిమిషాలకో బస్సు

రాయదుర్గం: మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి నార్సింగికి బస్సులు వేశామని గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ పి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.ఈ రూట్‌లో నాలుగు మెట్రో బస్సులు, మరో నాలుగు ఆర్డినరీ బస్సులు నడుస్తాయని, బస్సు నంబర్ 221 అని తెలిపారు. ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందని ..మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి మొదటి బస్సు ఉదయం 6.25 గంటలకు, చివరి బస్సు రాత్రి 7.30 గంటలకు బయలుదేరతాయన్నారు. నార్సింగి నుంచి మొదటి బస్సు ఉదయం 7.20 గంటలకు బయలుదేరుతుందని, చివరి బస్సు రాత్రి 8.25 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఈ రూట్‌లో మియాపూర్ మెట్రో స్టేషన్‌లో ప్రారంభమయ్యే ఆర్టీసీ బస్సులు ఆల్విన్‌క్రాస్‌రోడ్డు, హఫీజ్‌పేట్, కొండాపూర్, గచ్చిబౌలి కూడలి, కోకాపేట్, కోకాపేట్ క్రాస్‌రోడ్డు మీదుగా నార్సింగి వరకు నడుస్తాయన్నారు. కాలనీ, బస్తీల నుంచి మెట్రో స్టేషన్లకు బస్సు సౌకర్యం కల్పించేందుకు ఈ రూట్‌లో వేశామని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అన్ని వార్డుల్లో కంటివెలుగు కేంద్రాలు



కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

దుండిగల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కంటివెలుగు కేంద్రాలను నిర్వహిస్తున్నామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. మల్లంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ శామీర్‌పేట సంధ్య, రఘుపతిరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత..

బహదూర్‌పల్లిలోని 11, 12, 13, 14 వార్డుల్లో ఉన్న వీధి కుక్కలను శానిటేషన్ సిబ్బంది పట్టుకున్నారు. వాటిని బ్లూక్రాస్ సిబ్బందికి అప్పగించారు. స్థానిక ప్రజలకు వీధి కుక్కల నుంచి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు.

కంటి సమస్యను దూరం చేసేందుకే కంటి వెలుగు



కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలను అందిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: పేదల కంటి సమస్యను దూరం చేసేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ కంటివెలుగు పథకాన్ని తీసుకువచ్చారని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధి ఇంద్రానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం ఆయన స్థానిక కార్పొరేటర్ బాలాజీ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళ్ల పరీక్షలు చేయించుకున్న పలువురికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కళ్లద్దాలను పంపిణీ చేశారు.

◆ అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. తీవ్ర కళ్ల సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వమే ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తోందన్నారు. 18 ఏళ్ల పైబడ్డ ప్రతి ఒక్కరూ కళ్ల పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవాని ప్రసాద్ మెడికల్, కార్పొరేటర్ రవికిరణ్, కో.ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీమ్, బీఆర్‌ఎస్ నాయకులు ఆవుల జగన్‌యాదవ్, చంద్రగిరి సతీష్, హర్యా నాయక్, శ్రీనివాస్‌గౌడ్, దశరత్, ఆనంద్‌రెడ్డి, సందీస్ కుమార్, మెడికల్ సూపర్‌వైజర్ లతీఫా బేగం, డీఈవో విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌డీ ఫీజు తగ్గించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థి నాయకులు వీసీ ప్రొ.రవిందర్‌ను కోరారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్లో పరిశోధన విద్యార్థుల ఆధ్వర్యంలో ఫీజుల పెంపుపై నెల్లిసత్య అధ్యక్షతన జరిగిన సదస్సులో లా డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్, ప్రొ.కాశీంతో పాటు ఇతర విభాగాల అధ్యాపకులు, వివిధ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొని పరిశోధన విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఫీజులు తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని విద్యార్థులు హెచ్చరించారు.

అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టండి



ఐలా కమిషనర్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జీడిమెట్ల: డీపీ కాలనీ నుంచి దూలపల్లి వరకు.. ఇండస్ట్రియల్ ఏరియా నుంచి ఉన్న రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి ఆధ్వర్యంలో జీడిమెట్ల ఐలా కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రంలో పలు అంశాలు పేర్కొన్నారు. ఎన్‌హెచ్ 765డీ, ఎన్‌హెచ్ 44లను కలిపే రోడ్డు దుస్థితి చాలా దారుణంగా ఉందని వెంటనే మరమ్మతులు నిర్వహించాలని కోరారు. అదే కాకుండా జీడిమెట్ల పారిశ్రామికవాడలో అంతర్గత రోడ్లు సైతం బాగాలేవని వాటికి సైతం మరమ్మతులు నిర్వహించాలని వినతిపత్రంలో కోరారు. నెలల తరబడి రోడ్డు గుంతలమయంగా ఉన్నప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడం చాలా దారుణమని బీజేపీ నాయకులు అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మల్లారెడ్డితో పాటు శంకర్‌రెడ్డి, హనుమాన్‌జీ తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకోవడమేంటి.?



గాజులరామారం బాలాజీ లేఅవుట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎంఆర్పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్: దళిత బంధు పథకం లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకోవడం హేయమైన చర్య అని, వారిని వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఎంఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రామచంద్ర మాదిగ, జిల్లా నాయకుడు శ్రీనివాస్ మాదిగలు డిమాండ్ చేశారు. మంగళవారం గాజులరామారం బాలాజీ లేఅవుట్‌లోని బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల అభ్యున్నతికి దళిత బంధు పథకాన్ని తీసుకొస్తేఅధికార పార్టీ ఎమ్మెల్యేలు లబ్ధిదారుల నుంచి లక్షలు తీసుకోవడం దారుణమన్నారు. ఇదే విషయాన్ని సీఎం మీడియా ముఖంగా తన వద్ద చిట్టా ఉందని తెలిపారని అన్నారు. వారిని తక్షణమే పదవులను తొలగించాలన్నారు. దళితబంధు పథకం అమలులో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర హైకోర్టు సుమోటోగా స్వీకరించాలని కోరారు. అదే విధంగా ఎవరైతే రూ.2లక్షల నుంచి రూ.3లక్షలు తీసుకున్నారో ఆ ఎమ్మెల్యే దగ్గర ఆ డబ్బును లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్ సౌక్-2023

- హెచ్‌సీయూ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఆర్టిస్టులు, ఆర్ట్ లవర్స్ కోసం ఔట్‌రీచ్ ప్రోగ్రామ్





రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్‌సౌక్-2023 అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా ఆర్టిస్టులు, ఆర్ట్ లవర్స్ కోసం ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ మేరకు హెచ్‌సీయూ పీఆర్‌ఓ ఆశిష్ జాకబ్ థామస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూ ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని సిటీ క్యాంపస్ గోల్డెన్ థ్రెషోల్డ్‌లో 'ఆర్ట్ సౌక్ -2023' పేరిట నిర్వహించారు. అరబిక్ పదం 'సౌక్' అంటే 'బజార్' అని అర్థం. ఈ కార్యక్రమాన్ని హెచ్‌సీయూలోని ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెయింటెడ్ టెర్రకోట ప్లాటర్ నుంచి వెల్డెడ్, టెర్రకోట శిల్పాలు, జైన్‌ల నుంచి ఆభరణాల వరకు అన్నింటిని ప్రదర్శించారు. దీంతోపాటు క్యాలెండర్లు, బ్యాగ్‌లు, స్కార్ఫ్‌లు, కుండలు, మార్బుల్ ప్రింటింగ్, బ్లాక్ ప్రింటింగ్‌తో సహా వివిధ కళాత్మక పద్ధతులతో చేతితో తయారు చేసిన వస్తువులు ఉంచారు. యానిమేటెడ్ ఫిల్మ్ ప్రదర్శించారు రుచికరమైన వంటకాలు, పానీయాలు కూడా అందుబాటులో ఉంచడంతో సందర్శకులు ఎంజాయ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు, సందర్శకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద డీఎస్‌పీ ధర్నా



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రతి పౌరునికి ఉచితంగా రాజ్యాంగాన్ని పంపిణీ చేయాలని ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద జిల్లా కన్వీనర్ రాజ్‌కమల్ మహారాజ్ అధ్వర్యంలో డీఎస్‌పీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కమల్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు భారత రాజ్యాంగం ద్వారానే లబ్ధి పొందుతున్నారన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి పౌరునికి ప్రభుత్వం అందజేయాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌ఓ లింగ్యానాయక్‌కు అందజేశారు. సైదులు, గణేష్, శివ, హరినాథ్, పరశురాం, వివేక్ దినయ్,మహేష్, శ్రీనివాస్, మల్లేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

కళాశాలను మల్లంపేటలోనే కొనసాగించాలి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

దుండిగల్: క్యాంపస్ నిర్వాహకులు తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు, ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలో నారాయణ ఉమెన్స్ కళాశాలతో పాటు హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. కాగా సీనియర్ విద్యార్థులను మల్లంపేట నుంచి బాచుపల్లి క్యాంపస్‌కు మారుస్తున్నట్లు క్యాంపస్ నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఏబీవీపీ నాయకులు మంగళవారం కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు.

◆ రెండేళ్ల పాటు మల్లంపేటలోనే కళాశాలను కొనసాగిస్తామని చెప్పి తీరా సంవత్సరం గడిచాక ఇక్కడిని నుంచి తరలిస్తున్నామని చెప్పడం సరికాదన్నారు. ఇదే ప్రాంగణంలో కొనసాగించాలని భీష్మించుకు కూర్చున్నారు. తల్లిదండ్రుల ఆందోళనతో దిగివచ్చిన కళాశాల యాజమాన్యం రెండు రోజులు సమయం ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

అంబేడ్కర్ విగ్రహానికి రంగులు పూసిన దుండగులు



సీఐ రామకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట ఇందిరమ్మ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రంగులు పూశారు. విషయం తెలుసుకున్న దళిత సంఘాల నేతలు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. దళిత సంఘాల ఐక్యవేదిక కమిటీ ఆధ్వర్యంలో దుండిగల్ సీఐ రామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాహుల్, ప్రసన్నకుమార్, మేకల నాగేశ్, అంజన్న, సల్మాన్ రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.